# మనస్తత్వాలు

# మనస్తత్వాలు

లలిత ఉద్యోగం చేయాలనుకోవటం సూర్యానికెంత మాత్రం ఇష్టంలేదు—

తను సంపాదించి తెచ్చే నూటయాభై రూపాయలతో చాలినా చాలకపోయినా ఇంటిల్లిపాదినీ పోషించేందుకైనా ఇష్టపడతాడుగాని...ఉద్యోగం కోసం ఆడపిల్ల వీధిలోకి వెళ్ళటమనేది సుతరామూ గిట్టదు.

తమ్ముడు చిరిగిన చొక్కాలతో ఆఫీసుకెడుతుంటే యెంతో బాధపడుతుంది లలిత. చదువుకుని సంపాదించగల అర్హత వున్న తను కూడా, గోళ్ళు గిల్లుకుంటూ యింట్లో కూర్చుని పెద్దతనం వచ్చిన అమ్మా నాన్నాకుమల్లే... తమ్ముడి ఒక్కడి సంపాదన మీదే, తింటూ కూర్చునేందుకు మనస్కరించటంలేదు.

ఇంట్లో జరుగుబాటు చాలా కష్టమవుతోందని సూర్యానిక్కూడా తెలుసు. అయినా...తనకంటే తక్కువ

జీతం తెచ్చుకుంటూ పెద్ద పెద్ద కుటుంబాలను పోషిస్తున్న వాళ్ళెందరు లేరని వాదిస్తాడు. ఉన్న దాంతోనే సర్దుకుందా మనే స్వభావం.

అంతే కాదు.

ఉద్యోగం కోసం అడ్డమైన వాళ్ళ కాళ్ళూ పట్టుకో వలసినఖర్మ మనకెందు కంటూ లలిత కెన్నోసార్లు చెప్పాడు.

కానీ...లలిత దృష్టిలో సూర్యం పాత తరహా మనిషి! పిరికివాడు!! అమాయకుడు!!!-అంతకు మించిన బలహీనుడు...

రోజు రోజుకీ ఉద్యోగం చేయాలనే పట్టుదల ఎక్కు-వవుతోంది లలితలో! -

మందులకోసం డబ్బు చాలక నాన్నపడే అవస్థ, సంవత్సరం పొడుగునా ఒకే ఒక్క చీరెతో (చిరిగినా అతుకు వేసుకుని) గడుపుకుంటూ అభిమానాన్ని చంపుకుంటున్న తల్లి వేదన చదువుకునేందుకు పుస్తకాలు లేక తోటి స్నేహితుల దగ్గర అరువు తెచ్చుకుంటున్న చిన్న చెల్లెలి బాధ చూస్తుంటే...లలిత మనస్సు ఉద్యోగంకోసం కలవరపడు తోంది.

ఇంటి బాధ్యతను సమానంగా తనూ పంచుకోవా లనే ఆరాటం లలితలో పురకలు వేస్తోంది.

రాత్రి ఎనిమిది గంటలు దాటింది.

ముందు గదిలో కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నాడు సూర్యం.

తమ్ముడితో తన నిర్ణయం చెప్పాలని గదిలో కొచ్చింది లలిత! వయస్సులో చిన్నవాడే అయినా తమ్ము డంటే భయం ఎందుకో?-విషయం ఎట్లా చెప్పాలో అర్థం

కాక ప్రక్కనున్న స్టూలుమీద మౌనంగా కూర్చుండి పోయింది.

వ్రాసుకుంటున్న వాడల్లా తలెత్తి లలితకేసిచూశాడు. సూర్యం ముఖంలోకి చూచేసరికి తనెందు కొచ్చిందీ మర్చి పోయింది.

ఓ క్షణం అయ్యేక "నీతో ఓ విషయం చెప్పాల నుందిరా..." అంది.

"చెప్పు...ఆగావేం?"

"మరేం లేదు...యెట్లా చెప్పాలా అని..."

"ఏదైనా యింటి విషయమా!?..." సాలోచనగా అన్నాడు.

"కాదురా..."

"మరి!...నీకంటే చిన్నవాడని, విషయం చెప్పేందుకు నా దగ్గర సంశయిస్తావేం?!-చెప్పక్కా!!-"

"చూడు తమ్ముడూ! చదువుకున్న నేనుకూడా గోళ్ళు గిళ్ళుకుంటూ కూర్చుంటుంటే సంసారం యెట్లా సాగుతుంది చెప్పు!...అందుకని..."

"ఆఁ...అందుకని? -"

"నువ్వు కోప్పడనంటే..."

"ఉద్యోగం చేస్తానంటావ్! అంతేగా?—ఏమో అక్కా...నువ్వు ఉద్యోగంకోసం వీధిలో కెళ్ళటం, పది మందిలో మెలిగి పల్చనవటం నా కిష్టంలేదు..."

"ఎందుకనిరా?!—"

"ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్ళ నెందరినో చూస్తున్నాం..." యింకా యేదో చెప్పబోయి ఆగాడు.

JOSEPH'S JUNIOR CO
LIBRARY

"నీ బాధ నా కర్థమైంది. పదిమంది మనస్తత్వాల వారిమధ్య మెలగం కష్టం - అందుకని మన యిబ్బందులను పెంచుకుంటూ మరింత బాధ పడ్తామా ఆలోచించు!!-"

"నీతో వాదించలేను. ఎన్నిసార్లు చెప్పినా వినకుండా నువ్వొక నిర్ణయాని కొచ్చేక నేనేం చెప్పి ప్రయోజనం వుండదు. ఓ సారి బైటికెళితే కష్ట సుఖాలు, మంచీ చెడూ నీకూ తెల్సివస్తుంది. అమ్మా నాన్నకు యిష్టమైతే నాకేం అభ్యంతరంలేదు. బైదిబై...ఎక్కడో దేనికి...మా ఆఫీసులో రైటిచేస్తాను!!—"

సంతోషంగా వెళ్ళిపోయింది లలిత.

లలిత ఆనందానికి మేరల్లేవు. తను ఉద్యోగం చేయబోతున్నందుకు కాదు- తమ్ముడు యిష్టపడినందుకు!

ప్రక్కింటి శారద లాగా తనూ ఉద్యోగం చేయబోతుంది. ఇంటి బాధ్యతలో భాగస్వామి కాబోతోంది. చదివిన చదువు సార్థకం అవబోతోంది. సంతోషంతో హృదయం ఉక్కిరి బిక్కిరవుతోంది.

మరోవైపు విచిత్రమైన ఆలోచన!!

ఉద్యోగంలో వుండే బరువు బాధ్యత లెలాంటివో తనకు తెలీదు. ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వహించగలనా అని మరో సందేహం...

ఆలోచనా పరంపరలతో సతమత మవుతున్న మనసును కుదుట పర్చుకుని హాయిగా నిద్రపోయింది-

* * *

ఉద్యోగంలో చేరిన మొదటిరోజు హెడ్‌క్లార్కు వరసవారీగా గుమాస్తాలందరి దగ్గరకు తీసుకెళ్ళి లలితను పరిచయం చేశాడు.

నమస్కారం చేశాడొకాయన!

పళ్ళు ఇకిలించాడొక గుమాస్తా!!

టెర్లిన్‌షర్టు కాలర్ సర్దుకుంటూ, సిగ్గు అభినయిస్తూ అదోలా చూశాడు పెళ్ళికాని కుర్ర క్లార్కు!!!

అంతా తలొక రకమైన అభినయాన్ని ప్రదర్శించారు. అంతా మగవాళ్ళే ఆఫీసులో...తను తప్ప!!

తన సీట్లో కూర్చుంది.

"సూర్యం సిస్టరు రా! జాగ్రత్త సుమా?!" అనేసి వెనక వైపునుంచి కామెంటు విన్పించింది.

"జాగ్రత్తగల అమ్మాయిలా వుందిరా!!" మరో కాంప్లిమెంటు.

గట్టిగా శ్వాసపీల్చి విడిచింది లలిత.

హెడ్‌క్లార్కు దేవుడులాంటి వాడు అనుకుంది.

తను వూహించినట్టే పదిరకాల మనస్తత్వాలుగల మగాళ్ళ మధ్యకొచ్చి వుద్యోగం చేయాల్సి వచ్చింది.

సూర్యం సీటు ప్రక్కగదిలో వుంది.

ఆఫీసు వేళల్లో తనతో మాట్లాడడు పేరుపెట్టి పిలవడు. వచ్చిన పనేదో చెప్పి ముభావంగా వెళ్ళిపోతాడు.

తను ఆఫీసులో అడుగు పెట్టగానే తమ్ముడిలో వచ్చిన మార్పుకు ఆశ్చర్యపోతోంది.

లంచి టైంలో ఆఫీసరుగారి దగ్గరకు తీసుకెళ్ళి పరి చయం చేశాడు హెడ్‌క్లార్కు.

నమస్కారం చేసింది లలిత!

"చూడమ్మా! ఆఫీసుల్లో లేడీక్లార్కున వుండకూడదనే వారిలో నేను ప్రథముడ్ని. అయినా...నూర్యం కష్టసుఖాలు విన్నాక నా అభిమతానికి వ్యతిరేకంగా నీకు వుద్యోగ మివ్వటం జరిగింది. జాగ్రత్తగా పనిచేసుకో! యు కెన్ గో!!"

సవినయంగా 'థాంక్సు' చెప్పుకుని బైటి కొచ్చింది.

రోజులు గడుస్తున్నకొద్దీ తమ్ముడిలో విచిత్రమైన మార్పు రావటం లలిత గమనిస్తూనేవుంది.

కనీసం యింట్లోనైనా స్వతంత్రంగా చనువుగా మాట్లా డటం మానేశాడు.

అటు చూద్దామా అంటే...కాలక్షేపం కోసం కంపె నీలో మరో లేడీ క్లార్కయినా లేదు.

ఆఫీసులో తనుగా యెవ్వరితోనూ మాట్లాడకపోయినా, వారికై వాళ్ళే ఏదో పనిగట్టుకుని తన దగ్గరకు రావటం, మాట్లాడాలని ప్రయత్నం చేయుటంచూచి ఆశ్చర్యపోతోంది.

వారి మనోప్రవృతులకు జాలిపడుతూ 'పూర్ ఫెలోస్' అనుకోక తప్పటంలేదు.

ఉద్యోగం 'హేపీ'గానే వుంది.

సొసైటీలో తను వూహించని కొత్తదనం కన్పిస్తోంది. ఆడముఖాలకు మొహం మొత్తిన వారికిమల్లే ప్రతి క్లార్కూ తనను పలుకరించటం, వెకిలిగా నవ్వటం, మాట్లాడేందుకు పోటీలు పడటం చూస్తూ అసహ్యించుకున్నా...ఆఫీసన్న

తర్వాత ఏదో విధంగా వారిని సమాధాన పర్చక తప్పటం లేదనిపిస్తోంది.

ఆఫీసవగానే నేరుగా యింటి కొచ్చింది.

సూర్యం పొద్దుబోయి యింటికొచ్చాడు. గదిలో కెడుతూ లలిత కేసి విసురుగా చూచి "అక్కా ఓ మా రిలా రా..." అన్నాడు.

"లోపలి కొస్తూ "ఏరా! అట్లా వున్నా వేం?" అంది.

ముఖ మింత చేసుకుని "అక్కా! నువ్వీ వెధవ ఉద్యోగం చెయ్యకపోతే నేం? మానెయ్!" అంటున్న సూర్యం కళ్ళు యెర్రబడ్డాయి.

"ఇప్పుడేమైందిరా?!" అర్థంకాక అడిగింది.

"ఏమైందా...ఆ గోపాలంగాడు నోటి కొచ్చినట్లల్లా కూశాడు సహించక లేకపోయాను. నే విన్లేదనుకున్నాడు రాస్కెల్!! మాటా మాటా పెరిగింది. పెద్ద తగాదా జరిగింది. అయినా ఆఫీసులో నా వెనుక విన్పించే కామెంట్లకు తలెత్తుకో లేకుండా వున్నానక్కా! వుంటే తింటాం - లేకపోతే లేదు. అంతేకానీ అడ్డమైన వాడికీ తెలిక్కై పోకూడదు..."

"ఇంతకూ విషయ మేమిట్రా..."

"ఏముంది! నీ గురించి ఓ పెద్ద లెక్చరు దాని వెనుక కామెంటు. ప్రక్కనున్న బడుద్ధాయిలంతా గోపాలంగాడికి సపోర్టు. సమయానికి హెడ్‌క్లార్కు రాకపోతే గోపాలంగాడి ప్రాణం తీసివుండే వాడిని..."

ఒక్క క్షణంపాటు స్తబ్ధురాలైంది.

"నేను మొదటి నుంచీ చెప్తూనే వచ్చాను. నా మాట

వింటేనా?! ఉద్యోగంకోసం పదిమందిలోకొస్తే మనకు జరిగే సన్మానం చూస్తున్నావుగా!"

"నీ బాధ నా కర్థమైంది. ఆడవాళ్ళులేని ఆఫీసులో పనిచెయ్యటం..అందరూ నా గురించే అనుకోవటం కష్టమనిపిస్తుంది. నిజమే! కానీ సూర్యం...యిది లోకం! అన్నీ తెల్సిన వాడివి పసిపిల్ల వాడిలాగ బాధపడ్తా వెందుకుచెప్పు? నిజం నువ్వే ఆలోచించు!...నా ముఖం చూచి మాట్లాడు!! నీ కిష్టం కాకపోతే మానేస్తాను..."

"అది కాదక్కా!...మన వెనకాల అందరూ ఎంతెంత మాటలనుకుంటున్నారో వింటుంటే గుండె తరుక్కుపోతుంది. వాళ్ళ మాటలు నిజం కావనికూడా నాకు తెలుసు..."

"పిచ్చి సూర్యం. ఒకళ్ళనుకుంటున్నారని బాధపడితే మన మెన్నాళ్ళు బ్రతగ్గలం. వినేదానికి - నిజానికి చాలా దూరం!! అనవసరంగా మనసు పాడుచేసుకోకు!!"

లలిత వెళ్ళిపోయింది.

* * *

"ఒరే గోపాలం నువ్వు లాభంలేదోయ్. ఇది టెర్లిన్ యుగంరా బాబూ!! కాటను గుడ్డలు తొడిగే వాడిని యీ రోజుల్లో యే ఆడది ప్రేమిస్తుందోయ్..." ఓ కంఠ ధ్వని.

"అది గాదురా సుబ్బారావ్! టెర్లిన్ తొడిగినా... ఆమెగారికి గుమాస్తాలను చూస్తుంటే ముఖం మొత్తినట్లుంది గామోసు. గంటకు పాతికసార్లు నేరుగా ఆఫీసరు గదిలోకి పోతుంది ఫైళ్ళని వంక పెట్టుకుని..." మరో ఉపన్యాసం.

"అంటే...?" వెంకట్రావు వెర్రిమొహం వేశాడు. సుధాకరం మాటల్లో శేషార్థం బోధపడక విస్తుపోతూ-

"అంటే! పిచ్చి సన్నాసీ!! సేరుగా ఆఫీసరుతోనే ప్రేమ వ్యవహారం సాగిస్తోందన్న మాట!! తెలిసిందా?! ఈ విషయం మనకు తెలియదనుకుని పాతివ్రత్యం మనకు తెలీదనుకుని పాతివ్రత్యం వొలక పోస్తోందిరా పాపం..."

ఆఁ...ఆ సూర్యంగాడి ముఖం చూచిగానీ...లేక పోతేనా..."

లంచ్ టైంలో కార్యకర్తలంతా చేరి సభను జయప్రదం చేయ తల్చుకుని పై విధంగా వుపన్యాసాలు, అంగ విన్యాసాలు సాగిస్తున్నారు.

అంతవరకూ తలుపు ప్రక్కనే నిల్చుని వింటున్న లలిత భళ్ళున తలుపు రెక్కలు తోసుకుని వచ్చి తన సీట్లో కూర్చుంది.

కార్యకర్తల నోళ్ళు మూతబడ్డాయి.

కిక్కురుమనకుండా యెక్కడి వాళ్ళక్కడ తమ తమ సీట్లల్లో కూర్చుండి పోయారు.

లలిత మనస్సంతా అల్లకలోలమైంది. అవమానంతో నెత్తురు వుడికిపోతుంది. 'ఛీ! వెధవ మనుష్యులు' అని స్వగతంలో తిట్టుకుంది. ఎందుకిట్లా పరాయి ఆడపిల్లను ఆడిపోసుకుని పలుచన చేస్తారు అన్పించింది. అందువల్ల వారికొచ్చే లాభం ఏమిటని ఆలోచించింది. చదువుకున్నా సంస్కార హీనంగా ప్రవర్తిస్తూ నాగరికులమని చెప్పుకుని చెలామణీ అవుతున్న ఈ ళ్ళు మనుష్యులను, వారి నీచ మనస్తత్వాలను చీదరించుకుంది - ప్రతీకారం కోసం ఆలోచించసాగింది. మరో ఆలోచన...యెంతమంది నోళ్ళని తను మూయగలనన్పించింది. ఇది లోకం!!

గతంలో సూర్యం ఎందుకంతటి వేదనను అనుభవించాడో...వుద్యోగం మానేయమని తనను వారించాడో అర్థమైంది...స్వయంగా తన చెవులారా కుళ్ళు మనుష్యుల మనస్సులను తెలుసుకో గలిగింది.

"కొంపదీసి మన మాటలేవీ వినలేదు గదా"నే అనుమానంతో అంతా తన కేసి దొంగచూపులు చూడసాగేరు.

రెండు చేతులమధ్య ముఖాన్ని దాచుకుంది.

ఎప్పుడెప్పుడు అఫీసు టైం అయిపోతుందా అని ఎదురు చూడసాగింది.

*　　　*　　　*

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది.

లలిత రాకను గమనించిన సూర్యం వ్రాసుకుంటున్న వాడల్లా తలెత్తి చూశాడు.

ఏం చెప్పాలో ఎలా చెప్పాలో అర్థం కాలేదు లలితకు. ఓ క్షణం అయ్యేక చేతిలోని కాగితాన్ని సూర్యాని కందించింది.

కాగితం చదివి నిర్ఘాంత పోలేదు.

రాజీనామా కాగితం సూర్యం జేబులో పెట్టుకుంటుంటే 'పిచ్చి తమ్ముడు! ఇదంతా నీ కోసం...నీ మనశ్శాంతి కోసం...సమాజాన్ని, సంఘాన్ని ఎదుర్కోగల ధైర్యం నాకున్నప్పటికీ...నీ బాధ చూడలేక...నీ మనస్సు నొప్పించ లేక నేనీ పని చేశాను...' అనే అర్థం స్ఫురించేట్టు తమ్ముడి ముఖంలోకి చూచి వెళ్ళింది లలిత.